## క్షమాపణ చెప్పాల్సిందే



తెలంగాణ సాధించి పదేళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి అహంకారపూరితంగా వ్యాఖ్యలు చేయడం సరికాదు. రేవంత్‌రెడ్డి మాటలను తెలంగాణ సమాజం పూర్తిగా ఖండిస్తోంది. ఏడాది పాలనలో తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ఈ విధంగా వ్యవహరిస్తున్నారు. సీఎం స్థాయిలో హుందాగా ఉండాల్సింది పోయి ఇలా దిగజారి మాట్లాడడం దారుణం. అసమర్థ సీఎంగా పేరుతెచ్చుకున్న రేవంత్ రెడ్డి వెంటనే గద్దె దిగాలి. తెలంగాణ సమాజం యావత్తు గౌరవించే కేసీఆర్‌ను అవమాన పరిచినందుకు సీఎం రేవంత్ రెడ్డి బహిరంగంగా క్షమాపణలు చెప్పి తీరాల్సిందే. **- కోవ లక్ష్మి, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే**



## రేవంత్ మాటలు జుగుప్సాకరం



కేసీఆర్‌పై రేవంత్ చేసిన వ్యాఖ్యలు ఆయన నీచమైన ఆలోచనలకు నిదర్శనం. సీఎం హోదాలో ఉన్న వ్యక్తి హుందాగ వ్యవహరించాలి. కానీ.. దుర్మార్గమైన ఆలోచనలు, బూతు మాటలతో తన స్థాయిని దిగజార్చుకుంటున్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ గురించి అలా మాట్లాడడం జుగుప్సాకరం. పరిపాలన చేతకాక, ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమైన రేవంత్ ఇష్టానుసారంగా మాట్లాడాన్ని ప్రజలు గమనిస్తున్నారు. తమ నాయకుడు కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన రేవంత్ వెంటనే క్షమాపణలు చెప్పాలి. **- అనిల్‌జాదవ్, ఎమ్మెల్యే, బోథ్**

## పాలన చేతగాక అనుచిత వ్యాఖ్యలు..



ఆరు గ్యారెంటీల అమలు వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకే రేవంత్‌రెడ్డి కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నడు. తన చేతగాని తనాన్ని గత ప్రభుత్వం పైకి నెట్టాలని చూస్తున్నడు. కేసీఆర్ దమ్మున్న నాయకుడు. పదేండ్ల పాలనలో ఏం చేసినా ప్రజల ఆదరించారు. ప్రజల మనసును గెలుచుకున్నారు. పాలనలో విఫలమైన రేవంత్‌రెడ్డి సర్కారును జనాలు ఛీదరించుకుంటున్నారు. కేసీఆర్‌తో పోల్చుకుంటూ అన్యాయమైపోయినమని ఆవేదన చెందుతున్నరు. అది జీర్ణించుకోలేక కేసీఆర్ వంటి నాయకుడిపై చిల్లరమల్లర మాట్లాడి చిన్నగ చేసి చూపించే ప్రయత్నం చేస్తున్నారు. తెలంగాణ సాధించిన నాయకుడు కేసీఆర్‌పై రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నా. **- దుర్గం చిన్నయ్య, మాజీ ఎమ్మెల్యే, బెల్లంపల్లి.**



## విచక్షణ కోల్పోయారు..

తెలంగాణ సాధకులు కేసీఆర్‌పై రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నా. పాలన చేతకాక, ఎన్నికల్లో ఇచ్చిన 420 హామీల అమలులో విఫలమై ఇష్టారీతిన మాట్లాడుతున్నడు. ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తుండడంతో అసహనానికి లోనవుతున్నడు. కేసీఆర్ అసెంబ్లీకి రావడంతో రేవంత్‌రెడ్డికి భయమేస్తున్నది. పాలన వైఫల్యాలపై కేసీఆర్ నిలదీస్తే జనంలో తలెత్తుకోలేమని అవమానించేలా మాట్లాడుతున్నరు. ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించి, తెలంగాణను అభివృద్ధి పథంలో పరుగులు పెట్టించిన కేసీఆర్ వంటి నాయకుడిపై రేవంత్ అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదు.
**- బాల్క సుమన్, బీఆర్‌ఎస్ పార్టీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు**

## రాష్ట్రం పరువు తీస్తున్నారు..



రేవంత్‌రెడ్డి దిగుజారుడు మాటలు మాట్లాడుతూ రాష్ట్రం పరువు తీస్తున్నాడు. సీఎం హోదాను మరిచి నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నరు. దేశంలో ఏ రాష్ట్ర ముఖ్యమంత్రి కూడా రేవంత్ మాదిరిగా మాట్లాడిన సందర్భాలు లేవు. సీఎం హోదాలో ఉన్న వ్యక్తి కుర్చీకి గౌరవం వచ్చేలా వ్యవహరించాలి. కానీ.. ఆయన మాట్లాడిన తీరును ప్రజలు, మేధావులు గమనిస్తున్నారు. కేసీఆర్ గురించి ఇష్టానుసారంగా మాట్లాడడం ఆయన దొంగబుద్ధికి నిదర్శనం. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడం చేతకాక అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారు. గతంలో అసెంబ్లీ, మూసీ నది విషయంలో కూడా వ్యాఖ్యలు చేసిన రేవంత్‌రెడ్డి మరోసారి నోరు పారేసుకోవడం ఆయన దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం.
**- జోగు రామన్న, మాజీ మంత్రి.**



# రేవంత్.. ఖబడ్దార్..

## సీఎం అనుచిత వ్యాఖ్యలపై భగ్గుమన్న తెలంగాణ

- కేసీఆర్ అంటే రేవంత్‌కు భయమెందుకు?
- మొన్నటి దాక అసెంబ్లీకి రావాలంటూ పట్టు
- ప్రభుత్వాన్ని చీల్చిచెండాడుతామంటూ కేసీఆర్ ప్రకటన
- సమావేశానికి హాజరైన రోజే అంతర్మథనంలో పడిన సర్కార్
- వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు రేవంత్‌రెడ్డి అసందర్భ ప్రేలాపనలు
- పార్టీలకు అతీతంగా కేసీఆర్‌పై వ్యాఖ్యలను ఖండిస్తున్న నాయకులు, మేధావులు


మంచిర్యాల ప్రతినిధి/కుమ్రం భీం ఆసిఫాబాద్, మార్చి13(నమస్తే తెలంగాణ) : తెలంగాణ అంటే గుర్తుకొచ్చే పేరు కేసీఆర్.. ప్రత్యేక తెలంగాణ వాదాన్ని నిలబెట్టి, చావు నోట్లో తలబెట్టి, ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన యోధుడు. యావత్ తెలంగాణ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచే నేత. అసెంబ్లీ ఎన్నికలప్పుడు ఏ ఊరుకెళ్లినా మా దగ్గర ఎమ్మెల్యే ఎవ్వరైనా పర్లేదు, కానీ.. తెలంగాణకు కేసీఆర్ సారే ముఖ్యమంత్రిగా ఉండాలని చెప్పని మనిషే లేడు. అది కేసీఆర్‌పై తెలంగాణ జనాలకు ఉన్న అభిమానం. పదేండ్ల స్వరాష్ట్ర పాలనలో 60 ఏండ్ల సమైక్య పాలన గాయాలను మానేలా చేసిన ధీరుడు. రైతులు, మహిళలు, వృద్ధులు, విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజలు ఆయన పాలనలో సుభిక్షంగా బతికారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే తెలంగాణ అల్లకల్లోలమైంది. రైతులు ఆగమైతున్నరు. మహిళలు, వృద్ధుల సంక్షేమం గాడితప్పింది. గురుకులాలు, ఆశ్రమ పాఠశాలల్లో పిల్లలు చనిపోతున్నరు. సమస్యల వలయంలో చిక్కుకుని ఉద్యోగులు విలవిలలాడుతున్నరు. ఇక ఈ సర్కార్‌కు ఇచ్చిన గడువు చాలు చీల్చి చెండాడుదామంటూ కేసీఆర్ పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేశారు. సర్కారును నిలదీయాలంటూ పిలుపునిచ్చారు. మొన్నటి దాక అసెంబ్లీ ఎందుకు రావడం లేదంటూ ప్రశ్నించిన రేవంత్‌రెడ్డి.. కేసీఆర్ అసెంబ్లీకి రావడంతో ఏం చేయాలో తెలియని అంతర్మథనంలో పడిపోయాడు. పాలన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ఏం చేయాలో తెలియక కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిండు. నోరుంది కదా అని ఇష్టం వచ్చినట్లు పారేసుకున్నడు. స్ట్రేచర్.. స్ట్రెచ్చర్.. మార్చురీకి పోవాలంటూ కేసీఆర్‌పై అక్కసును వెల్లగక్కిండు. పరిపాలన చేత కాక.. చావుభాష మాట్లాడిండు. కేసీఆర్ అంటే ఉన్న భయంతో ఆయనతో నేరుగా కొట్లాడలేక అవాకులు.. చవాకులు మాట్లాడిండు. సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలపై తెలంగాణ సమాజం భగ్గుమంటున్నది. ఇవేం మాటలు రేవంత్ అంటూ మండిపడుతున్నది. పార్టీలకు అతీతంగా రాజకీయ నాయకులు, మేధావులు కేసీఆర్‌పై రేవంత్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నారు.

## దేశానికి గాంధీ ఎలానో, తెలంగాణకు కేసీఆర్ అలాగే..



ఏ నాయకుడైనా కానివ్వండి ప్రతిపక్షంలో ఉన్నా, అధికారంలో ఉన్నా, ఎంత వ్యతిరేకత ఉన్నా ఆసుపత్రికి పోవాలి, మార్చురీకి పోవాలని మాట్లాడడం సరికాదు. సంస్కారం ఉన్న ఏ వ్యక్తి అలా మాట్లాడరు. భారతదేశానికి గాంధీ ఎలానో, కేసీఆర్ తెలంగాణకు అలాగే. అలాంటి నాయకుడిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి సంస్కారం లేని వ్యక్తిగా గుర్తింపు తెచ్చుకున్నారు. సీఎం అనుచిత వ్యాఖ్యలను పూర్తిగా ఖండిస్తున్నా. తక్షణమే కేసీఆర్‌కు, తెలంగాణ సమాజానికి రేవంత్‌రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలి.
**- దివాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యే, మంచిర్యాల**

## ప్రజలు తరిమే రోజులు దగ్గరపడ్డాయ్..



కేసీఆర్‌పై రేవంత్‌రెడ్డి చేసిన అసభ్యకరమైన మాటలను తీవ్రంగా ఖండిస్తున్నా. కేసీఆర్ ఇక మార్చురీకి పోతాడేమో అంటూ నీచంగా మాట్లాడడం అత్యంత దారుణం. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి పెట్టిన గొప్ప మనిషిగా కేసీఆర్‌ను రాష్ట్ర ప్రజలు గుండెల్లో పెట్టుకున్నారు. అలాంటి నేతపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రేవంత్‌రెడ్డి భేషరతుగా క్షమాపణలు చెప్పాలి. రేవంత్‌రెడ్డి ఎక్కడ సమావేశాలు పెట్టినా.. కేసీఆర్‌ను వ్యక్తిగతంగా దూషించడం అలవాటైపోయింది. పాలన చేతకాక నోటికొచ్చిన మాటలు మాట్లాడుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న రేవంత్‌రెడ్డిని ప్రజలు తన్ని తరిమేసే రోజులు దగ్గరలోనే ఉన్నాయి.
**- కే.రాంకిషన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నిర్మల్ నియోజకవర్గ సమన్వయకర్త**

## రేవంత్ రెడ్డికి రోజులు దగ్గరపడ్డాయి



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రోజులు దగ్గరపడ్డాయి. పాలన చేతకాని సీఎంగా పేరుతెచ్చుకున్న రేవంత్ రెడ్డికి కనీసం సభ్యత.. సంస్కారం కూడా లేదని అసెంబ్లీ సాక్షిగా నిరూపితమైంది. కేసీఆర్ పాలనలో పదేళ్లు హాయిగా జీవించిన అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్ ఏడాది పాలనలో అష్టకష్టాలు పడుతున్నారు. త్వరలో రేవంత్ రెడ్డినే తెలంగాణ ప్రజలు స్ట్రెచర్‌మీదికి పంపిస్తారు. పదేళ్లు ప్రజారంజకంగా పాలించిన కేసీఆర్ తలుచుకుంటే రేవంత్ రెడ్డి సీఎంగా ఉండలేరు. కేసీఆర్ సార్ సహనాన్ని రేవంత్‌రెడ్డి అలుసుగా తీసుకుంటున్నారు. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి నోటిని అదుపులో పెట్టుకోకపోతే గుణపాఠం తప్పదు.
**- రంగు సందీప్ గౌడ్, బీఆర్‌ఎస్ యూత్ లీడర్, దహెగాం**

## ఛీదరించుకుంటున్నరు..



రేవంత్‌రెడ్డి తన స్థాయిని మరచి మాట్లాడుతున్నడు. కాంగ్రెస్ పాలనపై, రేవంత్ తీరుపై ప్రజలు ఛీదరించుకున్నా పద్ధతి మార్చుకోవడం లేదు. పరిపాలన చేతకాక, ఇచ్చిన హామీల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే కేసీఆర్ కుటుంబాన్ని టార్గెట్ చేసుకుని వ్యక్తిగత దూషణలకు దిగుతున్నడు. ఇలాంటి వ్యక్తికి రాష్ట్రాన్ని అప్పగించి తప్పు చేశామని ప్రజలు ఇప్పటికే తీవ్ర ఆవేదన చెందుతున్నారు. కేసీఆర్‌పై సీఎం స్థాయిలో ఉన్న వ్యక్తి మరణాన్ని కోరుకుంటూ మార్చురీ వంటి పదాలు వాడడాన్ని ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారు. రేవంత్ వ్యాఖ్యలతో సభ్య సమాజం తలదించుకునే పరిస్థితి వచ్చింది. ఇలాంటి దూషణలతో రాబోయే తరానికి ఎలాంటి సందేశం ఇస్తున్నాడో అర్థం అవుతున్నది. ఇప్పటికైనా తప్పు తెలుసుకుని వెంటనే కేసీఆర్‌కు క్షమాపణ చెప్పాలి. లేకుంటే రాబోయే రోజుల్లో గుణపాఠం తప్పదు.
**- భూక్యా జాన్సన్ నాయక్, బీఆర్‌ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ సమన్వయకర్త**

## అనుమతులు లేని పై అంతస్తు కూల్చివేత

మంచిర్యాలటౌన్, మార్చి 13 : మంచిర్యాల పట్టణంలోని ఇక్బాల్ అహ్మద్‌నగర్‌లో అనుమతులు లేకుండా నిర్మించిన భవనం పై అంతస్తును గురువారం మున్సిపల్ అధికారులు కూల్చివేశారు. షహనాజ్ తబస్సుమ్ అనే వ్యక్తి తాను తీసుకున్న అనుమతుల ప్రకారం కాకుండా అదనంగా పై అంతస్తు నిర్మించారు. అంతకుముందే సెల్లార్‌ను నిర్మించారు. సెల్లార్ నిర్మాణ సమయంలో పక్కన ఉన్న డాక్టర్ చంద్రశేఖర్ భవనానికి సంబంధించిన ప్రహరీ పడిపోవడం, దాంతో పాటే కింద తవ్విన సమయంలో ఆ భవనం పిల్లర్లు బయటకు కనిపించడంతో వారు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆ సమయంలో విచారణకు వచ్చిన అధికారులు నిబంధనలకు విరుద్ధంగా భవనాన్ని నిర్మించారని నిర్ధారణకు వచ్చారు. సంబంధిత భవన యజమానికి నోటీసులు అందజేశారు. నెలలు గడుస్తున్నా సెల్లార్ నిర్మాణం వల్ల డాక్టర్ చంద్రశేఖర్ భవనానికి సంబంధించి ఎలాంటి మరమ్మతులు చేపట్టక పోవడంతో తన భవనం కూలిపోయే ప్రమాదమున్నదని, తనకు న్యాయం చేయాలని హైకోర్టును ఆశ్రయించారు. కాగా, కోర్టు ఆదేశాల మేరకు అనుమతి లేకుండా నిర్మించిన పై అంతస్తును కూల్చివేస్తున్నట్లు టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ శ్యాంసుందర్ తెలిపారు.



నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనం

## మెరుగైన వైద్య సేవలందించాలి

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్
- చెన్నూర్ ప్రభుత్వ దవాఖాన సందర్శన



చెన్నూర్ : దవాఖానలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

చెన్నూర్, మార్చి 13 : ప్రభుత్వ దవాఖానకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం చెన్నూర్ పట్టణంలోని ప్రభుత్వ దవాఖానను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. పరిసరాలు పరిశీలించి.. రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం రోగులతో మాట్లాడి వైద్య సేవల గురించి ఆరా తీశారు. రోగులకు అవసరమైన అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయా? లేవా అనే విషయాన్ని డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. అలాగే దవాఖానలో రోగులకు చేస్తున్న పరీక్షలకు సంబంధించిన రిపోర్టులు సకాలంలో వస్తున్నాయా? లేవా తెలుసుకున్నారు. ప్రపంచ కిడ్నీ (డయాలసిస్) దినోత్సవం సందర్భంగా డయాలసిస్ పేషెంట్లతో కలసి కేక్ కట్ చేశారు. అనంతరం దవాఖానలో నూతనంగా ఏర్పాటు చేసి టీబీ పరీక్షా యంత్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ సత్యనారాయణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### గుణాత్మక విద్యనందించాలి..

నస్పూర్, మార్చి 13 : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు గుణాత్మక విద్యనందించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని మహాత్మాజ్యోతి బాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయం, జూనియర్ కళాశాలలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. తరగతి గదులు, వంటశాలలు, హాజరు పట్టిక, పరిసరాలను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ కొత్త మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారం, శుద్ధమైన తాగునీరందించాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. అనంతరం విద్యార్థుల పఠనా సామర్థ్యాలను పరీక్షించి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.

## హ్యాపీ బర్త్‌డే కవితక్క

రెబ్బెన, మార్చి 13 : రెబ్బెన మండల కేంద్రంలో నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితక్క జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ జాగృతి రెబ్బెన మండలశాఖ, బీఆర్‌ఎస్ మహిళా విభాగం నాయకుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జాగృతి మండల అధ్యక్షురాలు, బీఆర్‌ఎస్ జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి కుందారపు శంకరమ్మ, బీఆర్‌ఎస్ మహిళా మండలాధ్యక్షురాలు అన్నపూర్ణ అరుణ, రెబ్బెన మాజీ సర్పంచ్ బొమ్మినేని అహల్యాదేవి, బీఆర్‌ఎస్ మహిళా సీనియర్ నాయకురాలు పూలకండం వరలక్ష్మి, నాయకులు దారిశెట్టి శారద, తీపుల సువర్ణ, పల్లి రజిత, పల్లె శ్రీదేవి ఉన్నారు.



కేక్ కట్ చేస్తున్న జాగృతి, బీఆర్‌ఎస్ మహిళా నాయకులు

## సీఎం వ్యాఖ్యలతో మనస్తాపం

### తపస్ మండల అధ్యక్షుడు గొర్రె సంతోష్

భీమారం, మార్చి 13 : రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై సీఎం వ్యాఖ్యలు మనస్తాపానికి గురి చేశాయని తపస్ మండల అధ్యక్షుడు గొర్రె సంతోష్ కుమార్, ప్రధాన కార్యదర్శి భీమానాథ మహేశ్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో వారు మాట్లాడుతూ బుధవారం హైదరాబాద్‌లో జూనియర్ లెక్చరర్లకు నియామక పత్రాలు అందించే కార్యక్రమంలో పెండింగ్ డీఏలతో పాటు పీఆర్సీని వెంటనే ప్రకటించాలని ఉద్యోగులు కోరగా, అసలు ఆదాయమే లేదు..మీరేమో డీఏలు అడుగుతున్నారని సీఎం అనడం ఉద్యోగ.. ఉపాధ్యాయ లోకాన్ని దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. రాష్ట్రంలో నాలుగు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, మరో డీఏ ప్రకటించాల్సి ఉందని, పీఆర్సీ కోసం ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఎదురు చూపులతో కాలం వెళ్లదీయాల్సి వస్తున్నదన్నారు. డీఏలు, పీఆర్సీలు అడిగితే జీతాలే సమయానికి ఇవ్వడం లేదనడం శోచనీయమన్నారు. దుర్గం చందు, ఏలే విజయ్ కుమార్, సునీల్ కుమార్ పాల్గొన్నారు.





మాట్లాడుతున్న ఉపాధ్యాయులు